# 2. అర్రు కడిగిన ఎద్దు

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. యజమాని వృద్ధుడైన తండ్రిని గూర్చి తెలపండి.**

జ. ముసలి ఎద్దు యొక్క యజమాని తండ్రి చాలా మంచివాడు. ఈయన పాతకాలం మనిషి యజమాని, ఈ ఎద్దును కొనడానికి ముందే, యజమాని తండ్రి, తన కొడుకుకు ఇంటిపెత్తనం అప్పగించాడు.

ఈ యజమాని ముసలి తండ్రి కొడుకుకు పెత్తనం అప్పగించినప్పటి నుండీ, ఏ విషయంలోనూ అతడు జోక్యం చేసుకొనేవాడు కాదు. ఎద్దు ముసలిదై మూలన కట్టివేశాక, ఆ ముసలాయన వచ్చి, ఈ ఎద్దు దగ్గర కాసేపు కూర్చొని వెళ్ళేవాడు. ఈ ఎద్దు మెడచాచి ఆ ముసలాయన భుజం మీద పెట్టేది. ఆయన కాసేపు దాన్ని నిమిరేవాడు.

**ప్రస్తుత స్థితి :** యజమాని తండ్రి గారి భార్య, మరణించి చాలా రోజులయ్యింది. ఆయనకు ఒక్క కొడుకు, కోడలు, వారికి పుట్టిన నలుగురు ఆడ పిల్లలూ, ఒక మగపిల్లవాడు ఉండేవాడు. ఆయన కొడుకు, ఆయన సంగతిని పట్టించుకొనేవాడు కాదు. కోడలుకు, ఈ ముసలాయన అంటే పడేది కాదు. ఆమెకు ఈయన ఒక తగులాటంగా ఉండేవాడు. ఆమె ఈయనకు వేళకు అన్నం పెట్టేది కాదు. అందరకూ పెట్టి, తాను తిని, తరువాత ముసలాయనను భోజనానికి పిలిచేది. ఏది మిగిలితే అదే ముసలాయనకు ఆమె పెట్టేది. ఈయన కూడా ఏది వేస్తే అది తిని, చెయ్యి కడుగుకొనేవాడు.

ముసలాయన, కుక్కి మంచంమీద మునగదీసుకొని కూర్చుండేవాడు. తనకు చావు రావట్లేదని బాధపడేవాడు. ఈయన బక్కచిక్కి కుక్కిమంచంలో కూర్చుండేవాడు. ఈ ముసలాయన కొడుకు, కొత్త ఎద్దులను కొని పుట్టెడు ధాన్యం బరువుతో చెరువులో బండిని బురదలో లాగించడానికి సిద్ధం అయ్యాడు. ఆ ఊబిలో బండిని లాగించవద్దని ముసలాయన కొడుకుకు సలహా చెప్పాడు. కాని, కొడుకు వినలేదు.

ఈ ముసలాయనకూ, ఇంట్లో ఉన్న ముసలిఎద్దుకూ స్నేహం. ముసలి ఎద్దు మనస్సులో ఉన్న విషయం ఈ ముసలాయనకు తెలిసినట్లుగా , ఎవ్వరికీ తెలియదు. ప్రస్తుతం ముసలాయన అనుభవం, ముసలి ఎద్దు అనుభవం, సమానంగా ఉన్నాయి. ఎందుకు బ్రదుకుతున్నారో ఆ ఇద్దరికీ తెలియదు. యజమాని తండ్రి ముసలి ఎద్దు వద్దకు వచ్చి, అప్పడప్పుడు కూర్చుండేవాడు. యజమాని చూస్తే "నీకు ఇక్కడేం పని" అని, తండ్రిని గదమాయించేవాడు. ఈ విధంగా యజమాని తండ్రి, తన వారికి ఎవరికీ తాను అక్కరలేకపోయినా, దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుతున్నాడు.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. ఎద్దుకు, యజమాని తండ్రికి గల స్నేహం తెలపండి.**

జ. ఎద్దుకూ, యజమాని తండ్రికీ అంతులేని స్నేహం. ఎవరూ లేనప్పుడు యజమాని తండ్రి వచ్చి ముసలి ఎద్దు దగ్గర కూర్చునేవాడు. ఎవ్వరూ లేనప్పుడు యజమాని తండ్రిని చూసి ముసలిఎద్దూ, ముసలి ఎద్దును చూసి యజమాని తండ్రి కన్నీరు. పెట్టుకొనేవారు. అంతకంటె వారికి మాట్లాడు కోవలసింది ఏమీ లేదు.

www.sakshieducation.com

ముసలి ఎద్దు మెడ చాచి, యజమాని తండ్రి భుజం మీద పెట్టేది. ఆ యజమాని తండ్రి కాసేపు ఎద్దు మెడను నిమిరేవాడు. ఆ యజమాని తండ్రికీ, ఈ ముసలి ఎద్దుకూ ఒక పోలిక ఉంది. ఆ ఇద్దరూ కూడా, చావటం చేతకాక బతుకుతున్న వాళ్ళు వారి మాట ఎవరూ పట్టించుకోరు. వారిద్దరూ అందరికీ బరువే.

యజమాని తండ్రి ముసలి ఎద్దు దగ్గర కూర్చున్నప్పుడు యజమాని చూస్తే తండ్రి మీద కోపపడేవాడు. "నీకు ఇక్కడ ఏం పని?" అని యజమాని తండ్రిని యజమాని గదమాయించేవాడు. అప్పుడు యజమాని కర్రపోటు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయేవాడు.

యజమాని తండ్రి ఇంట్లోకి వెడుతూ ఉంటే ఈ ముసలి ఎద్దు కళ్ళప్పగించి ఆయనను చూస్తూ ఉండేది.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. ఎద్దును కొన్న తర్వాత రైతు ఎన్ని ఎకరాల ఆసామి అయ్యాడు ?**

జ. ఎద్దును కొన్న తర్వాత రైతు ఇరవై ఎకరాల ఆసామి అయ్యాడు.

**2. యజమాని ఇంట్లో ఎద్దుతోపాటు ఎవరి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది ?**

జ. యజమాని ఇంట్లో ఎద్దుతో పాటు యజమాని తండ్రి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.

**3. గోనెగుడ్డను తనపై కప్పితే బాగుండునని ఎద్దు ఎందుకు భావించింది ?**

జ. ఎద్దు వెన్ను మీద ఉన్న పుండును కాకి పొడుస్తోంది. తనపై గోనెగుడ్డ కప్పితే కాకి పొడవకుండా ఉంటుందని ఎద్దు భావించింది.

**4. హేతువాద ఉద్యమాన్ని నడిపించింది ఎవరు ?**

జ. హేతువాద ఉద్యమాన్ని త్రిపురనేని రామస్వామి చౌదరిగారు నడిపించారు.

**5. తెనాలి కథాత్రయం' లోని రచయితలు ఎవరు ?**

జ. 1) చలం 2) గోపీచంద్ 3) కొడవటిగంటి కుటుంబరావు అనే ముగ్గురు కథా రచయితలనూ 'తెనాలి కథాత్రయం' అంటారు.

**6. గోపీచంద్ రచించిన ఏ నవలకు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది ?**

జ. గోపీచంద్ రచించిన "పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా" అనే నవలకు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

**7. గోపీచంద్ రచించిన రెండు నవలల పేర్లు తెలపండి.**

జ. గోపిచంద్ గారి నవలలు 1) అసమర్థుని జీవయాత్ర 2) మెరుపుల మరకలు.

✡✡✡